క్లుప్తంగా

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.15, నల్ల వంకాయ 23, పొడుగు వంకాయ 23, బెండకాయ 55, పచ్చిమిర్చి 35, బజ్జీమిర్చి 35, క్యాప్సికమ్ 40, పచ్చకాకర 40, పందిరిబీర 35, క్యాబేజీ 9, క్యారెట్ 20, దొండ 25, గుండుబీన్స్ 45, గింజ చిక్కుడు 50, గోకరకాయ 40, కీర 23, దోసకాయ 26, బీట్‌రూట్ 15, ఉల్లిగడ్డ 18, ఆలుగడ్డ 21, చామగడ్డ 65, మొరంగడ్డ 19, కందగడ్డ 33, సొరకాయ 13, పొట్లకాయ 18, అరటికాయ 9 (ఒకటి), మునగకాయ 4-6, ముల్లంగి 3-5. ఈ ధరలు బుధవారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

రాంగోపాల్‌పేట్: సీతాఫల్‌మండి సబ్‌స్టేషన్ పరిధిలోని ఫీడర్ల మరమ్మతుల కారణంగా సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు వారాసీగూడ ఫీడర్ పరిధిలోని టీఆర్టీ క్వార్టర్స్, బీదలబస్తీ, కుట్టీవెలోడి హాస్పిటల్, ఎస్‌బీహెచ్, శివాజీ విగ్రహం, సెయింట్ జాన్స్ హైస్కూల్ ప్రాంతాలు. మధ్యాహ్నం 2.30గంటల నుంచి సాయంత్రం 5.30గంటల వరకు రామాలయం ఫీడర్ పరిధిలోని నామాలగుండు వాటర్ ట్యాంక్, శివాజీ విగ్రహం ప్రాంతాలు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు వారాసీగూడ ఫీడర్ పరిధిలోని మార్కండేయ నగర్, ఫ్రైడే మార్కెట్, ఎస్ఆర్ ఆస్పత్రి, రాఘవ గార్డెన్, ఉప్పరబస్తీ, బాపనబస్తీ ప్రాంతాలు. మధ్యాహ్నం 2.30గంటల నుంచి సాయంత్రం 5.30గంటల వరకు నామాలగుండు ఫీడర్ పరిధిలోని నామాలగుండు వెంకటేశ్వర స్వామి దేవాలయం, పద్మ గ్యాస్, అన్నానగర్, కిందిబస్తీ, నెహ్రూ హైస్కూల్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

కంటి వెలుగుకు స్పందన

అడ్డగుట్ట: కంటి వెలుగుకు ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందని అడ్డగుట్ట ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సాయి శంకర్ తెలిపారు. మంగళవారం ఆయన ఆయన బోయబస్తీ, బీజేఆర్‌లోని కంటి వెలుగు కేంద్రాలను సందర్శించి మాట్లాడారు. 18 సంవత్సరాలు పైబడిన వారందరూ కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అద్దాల పంపిణీ, కంటి ఆపరేషన్ల కోసం ఆస్పత్రులకు రిఫర్ చేయడంతో పాటు ఇతర కంటి సమస్యలు ఉన్న వారికి మందులు, మాత్రలు కూడా అందజేస్తున్నట్లు వెల్లడించారు. బీజేఆర్ కమ్యూనిటీహాల్లో 100 మందికి పరీక్షలు చేయగా 47 మందికి అద్దాలు ఇచ్చామని, 8 మందిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి రిఫర్ చేసినట్లు చెప్పారు. అదే విధంగా బోయబస్తీలోని కేంద్రంలో 76 మందికి పరీక్షలు నిర్వహించి 13 మందికి అద్దాలు, 15 మందిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి రిఫర్ చేసినట్లు వెల్లడించారు.

దీక్ష భగ్నం .. పలువురి అరెస్ట్


మాట్లాడుతున్న మందకృష్ణమాదిగ

ఉస్మానియా యూనివర్సిటీ: యూనివర్సిటీలలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని ఓయూ అధ్యాపకులు ప్రొ.కాశీం ఈ నెల చేపట్టిన దీక్షను పోలీసులు భగ్నం చేసి పలువురు విద్యార్థి నాయకులను అరెస్ట్ చేశారు. మంగళవారం దీక్ష శిబిరానికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణమాదిగ, హాజరై మద్దతు తెలిపి మాట్లాడారు. అనంతరం ఓయూ పోలీసులు ప్రొ.కాశీంకు నోటీసులు అందజేసి మందకృష్ణ మాదిగ, చనగాని దయాకర్‌ను అరెస్టు చేసి బొల్లారం పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయండి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో ఖాళీగా ఉన్న ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ ఉద్యోగాలను భర్తీ చేయాలని బీఎస్ఎఫ్ విద్యార్థి నేతలు డిమాండ్ చేశారు. మంగళవారం ఓయూ రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణను కలిసి బ్యాక్‌లాగ్ ఉద్యోగాల భర్తీలో జరుగుతున్న జాప్యంపై వాగ్వాదం చేశారు. కార్యక్రమంలో వేల్పుల సంజయ్, కొత్తపల్లి తిరుపతి, పులిగంటి వేణుగోపాల్ పాల్గొన్నారు.


కరాటే పోటీల్లో సత్తా



ఉస్మానియా యూనివర్సిటీ: ఈ నెల 17న సీఎం కేసీఆర్ పుట్టినరోజు పురస్కరించుకుని జరిగిన 3వ జాతీయ కరాటే చాంపియన్‌షిప్-23 పోటీల్లో ఓయూ పరిధిలోని శ్రీ విజ్ఞాన్ కళాశాల విద్యార్థిని జి.సౌమ్య ప్రతిభ కనబర్చింది. మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఈరబోయిన నర్సింహాయాదవ్ సౌమ్యను సన్మానించి అభినందించారు.

ష.. నిఘా నేత్రాలు నిద్రపోతున్నాయ్!

అలంకార ప్రాయంగా సీసీ కెమెరాలు



- లాలాపేటలో రెచ్చిపోతున్న దొంగలు
- మరమ్మతులు చేయాలంటున్న స్థానికులు
- దృష్టి సారించని అధికారులు, పోలీసులు


ఇందిరానగర్‌లో..


పనిచేయని సాయిబాబా దేవాలయం కమాన్ వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరా

లాలాపేట: ప్రస్తుత కాలంలో సీసీ కెమెరాల ప్రాముఖ్యత పెరగడంతో బస్తీలు, కాలనీలు, పార్కులు, రహదారులు పార్కుల్లో సీసీ సీసీ కెమెరాలను అమర్చుతున్నారు. సీసీ కెమెరాలు అందుబాటులోకి వచ్చిన తర్వాత నేరాల శాతం దాదాపుగా తగ్గిపోతోంది. దొంగతనాలు, హత్యల నిందితులను పట్టుకోవడంలో ఈ కెమెరాలే కీలకంగా మారుతున్నాయి. న్యాయస్థానాల్లో సైతం సీసీ కెమెరాలోని దృశ్యాలను సాక్ష్యాలుగా తీసుకుని తీర్పులు సైతం ఇస్తున్నారంటే సీసీ కెమెరాల పనితీరు ఇట్టే అర్థం చేసుకోవచ్చు. కానీ లాలాగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు ఆరంభ శూరత్వాన్ని ప్రదర్శిస్తున్నాయి. సీసీ కెమెరాల ఏర్పాటులో చూపించిన శ్రద్ధ వాటి నిర్వహణలో చూపించకపోవడంతో అవి దిష్టి బొమ్మల్లా మారాయి. ఇదే అదనుగా భావించిన దొంగలు రెచ్చిపోతున్నారని ఆయా ప్రాంతాల వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వరుస ఘటనలతో భయం భయం..

- లాలాపేట ఇందిరానగర్‌లో రెండేళ్ల క్రితం ఓ ఇంటి ముందు ఆడుకుంటున్న చిన్నారి నుంచి వెండి గొలుసులు ఓ గుర్తు తెలియని మహిళ దోచుకెళ్లింది. ఇప్పటి వరకు ఆ కేసును ఛేదించ లేదు.
- గత ఆదివారం తెల్లవారుజామున అదే ఇంటి వద్ద పార్కు చేసిన ద్విచక్ర వాహనాన్ని దుండగులు ఎత్తుకెళ్లారు.
- ఒకే వీధిలో ఈ రెండు ఘటనలు జరిగినా పోలీసులు ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల్లో రికార్డు కాలేదు. కానీ కొందరు వ్యక్తులు తమ ఇంటికి పెట్టుకున్న వాటిలో మాత్రం రికార్డు అయినప్పటికీ స్పష్టంగా లేవు. ఆ రికార్డులను సైతం పోలీసులకు ఇచ్చినా ఫలితం లేకుండాపోయింది.
- వస్తువులు పోతే మళ్లీ కొనుక్కోవచ్చు.. కానీ ఇళ్ల ముందు ఆడుకునే చిన్నారులను ఎత్తుకెళ్తే.. మా పరిస్థితి ఏంటని లాలాపేట ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.
- పోలీస్ సిస్టమ్‌ను అప్‌డేట్ చేస్తున్నారు.. పోలీసులకు ప్రభుత్వం అధునాతనమైన పెట్రో కార్లు (ఇన్నోవా కార్లు) ఇచ్చారు. కానీ పోలీసు విధులు మాత్రం పాత కాలం నాటి మాదిరిగానే ఉన్నాయని స్థానికులు చర్చించుకుంటున్నారు.
- సీసీ కెమెరాలు ఉన్నాయి పోలీసులు సైతం సకాలంలోనే అందుబాటులోకి వచ్చేందుకు అధునాతనమైన వాహనాలు ఉన్నాయి ఇక భద్రతకు ఢోకా లేదు అని భావిస్తున్న ప్రజలకు ఈ లాంటి వరుస సంఘటనలతో భద్రతపై నమ్మకం సన్నగిల్లే ప్రమాదం ఉంది.
- వేసవి కాలం సమీపిస్తున్నం నేపథ్యంలో రాత్రి వేళలలో ఉక్కపోతకు ప్రజలు ఆరుబయటే పడుకుంటారు. దొంగలు ఇదే సమయం అని తమ ప్రతిభకు పని చెప్పే అవకాశం ఉంది.
- ఇప్పటికైనా పోలీసులు ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను పరిశీలించి పనిచేయని వాటికి మరమ్మతులు లేదా కొత్తవి ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

జనావాసాలకు దూరంగా ఠాణా..

- లాలాగూడ ఠాణా పరిధిలో రైల్వేక్వాటర్స్, శేషాపహాడ్, శాంతినగర్, ఆర్యనగర్, లాలాపేట్, శ్రీపురికాలనీ, చంద్రబాబునగర్, ఇంద్రనగర్, సత్యనగర్, తదితర ప్రాంతాలు ఉన్నాయి. మొదటి నుంచే ఈ ప్రాంతాలకు ఠాణా దూరంగా మెట్టుగూడ ప్రాంతానికి సమీపంలో ఉంది. ఆయా కాలనీల్లో ఏమైనా జరిగినా సకాలంలో పోలీసులు చేరుకునే దుస్థితి కూడా లేదు. పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నా దాదాపుగా కిలో మీటర్ దూరం వెళ్లాల్సి వస్తోంది.

కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యం


ఆందోళనకారులతో చర్చిస్తున్న మంత్రి మల్లారెడ్డి

- మంత్రి మల్లారెడ్డి
- మంత్రి కార్యాలయం ముట్టడికి వచ్చి మంత్రికి జైకొట్టిన ఆందోళనకారులు

కంటోన్మెంట్: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందని మంత్రి మల్లారెడ్డి అన్నారు. మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో మల్లారెడ్డి క్యాంపు కార్యాలయం ముట్టడికి యత్నించారు. పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేయగా, మంత్రిని కలిసేందుకు అవకాశమివ్వాలని కోరారు. మంత్రి మల్లారెడ్డి సూచన మేరకు వారు క్యాంపు కార్యాలయానికి వచ్చి భవన నిర్మాణ కార్మికుల సమస్యపై మంత్రితో చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ కార్మికుల పక్షపాతి అని ఆరు నెలల క్రితం తనను పిలిచి కార్మికుల సంక్షేమం కోసం చేపట్టాల్సిన చర్యలపై సమీక్ష చేశారని గుర్తు చేశారు. గతంలో భవన నిర్మాణ కార్మికులు లేవనెత్తిన డిమాండ్ల పరిష్కారం దిశగా నివేదిక రూపొందించామన్నారు. ప్రతి జిల్లాలో ఒక కార్మిక భవనాలను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిందని స్థలాల కేటాయింపు పూర్తి కాగానే నిర్మాణాలు చేపడతామన్నారు. ప్రమాదవశాత్తు మరణించే కార్మికుల కుటుంబాలకు రూ.6 లక్షలు ఇస్తున్నామని, ఆ పరిహారాన్ని రూ.9 లక్షలకు పెంచుతూ ప్రతిపాదనలు రూపొందించామన్నారు. మొత్తానికి ముట్టడికి వచ్చిన ఆందోళనకారులు మల్లారెడ్డికి జైకొడుతూ అక్కడి నుంచి వెళ్లడం గమనార్హం. ఈ కార్యక్రమంలో సీఐటీయూ గౌరవ అధ్యక్షులు వంగూరు రాములు, సుంకర రామ్మోహన్ రావు, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి రత్నాకర్ కోటంరాజు పాల్గొన్నారు.

కబడ్డీ విజేతలు కీసర జట్లు


విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ మోడల్ హైస్కూల్‌లో బల్దెవ్ స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో రెండ్రోజులు జరిగిన అంతర్ పాఠశాలల కబడ్డీ పోటీల్లో కీసరలోని పాఠశాలలు విజేతలుగా నిలిచారు. మంగళవారం జరిగిన కార్యక్రమానికి స్పెషల్ ఆఫీసర్ ప్రొ.శంకర్ అధ్యక్షత వహించగా రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ ముఖ్యఅతిథిగా హాజరై విజేతగా నిలిచిన కీసర సెర్నిటీ హై స్కూల్ జట్టుకు రూ.5 వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన ప్రభుత్వ గురుకుల పాఠశాల జట్టు రూ.3 వేల నగదుతో పాటు ట్రోఫీ అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం జయశ్రీ, డాక్టర్ ధర్మతేజా, సుధాకర్, గోపి పాల్గొన్నారు.

'బీసీలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చిన్నచూపు'


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్ యాదవ్

రాంగోపాల్‌పేట్: దేశ జనాభాలో 52 శాతం ఉన్న బీసీలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిన్నచూపు చూస్తున్నాయని ప్రత్యామ్నాయ రాజకీయ వేదిక రాష్ట్ర అధ్యక్షులు నాగుల శ్రీనివాస్‌యాదవ్ ఆరోపించారు. రెజిమెంటల్‌బజార్‌లోని సంస్థ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రూ.45 లక్షల కోట్ల కేంద్ర బడ్జెట్‌లో బీసీలకు రూ.2 వేల కోట్లు కేటాయించిందని, సుమారు రూ.3 లక్షల కోట్ల రాష్ట్ర బడ్జెట్‌లో రూ.6200 కోట్లు కేటాయించిందని ఆయన విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరు మండల్ కమిషన్ రెకమండేషన్స్‌కు పూర్తిగా వ్యతిరేకంగా ఉందన్నారు. ఈ బడ్జెట్లు చూసిన తర్వాత రెండు ప్రభుత్వాలు బీసీలను అవమానించినట్లే అయిందన్నారు. మెజార్టీ ప్రజలైన బీసీలు రాజకీయ, సామాజిక చైతన్యంతో అధికారం కోసం పోరాటాలు చేయాల్సిన సమయం వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో గౌడ విద్యావంతుల వేదిక కన్వీనర్ వంగ రాములు గౌడ్, బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

బోయిన్‌పల్లిలో దారుణ హత్య


మూసా సిద్ధికి(ఫైల్)

కంటోన్మెంట్: ఓ రియల్టర్ హత్యకు గురైన ఘటన బోయిన్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ రవికుమార్ వివరాల ప్రకారం.. ఫయాజుద్దీన్ అనే వ్యక్తి బోయిన్‌పల్లి పీఎస్ పరిధి దిల్‌కుష్‌నగర్‌లో నివాసముంటూ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు. బార్కాస్‌కు చెందిన మూసా సిద్దికికి చెందిన కేఎంఆర్ ఇండియా హోమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో ఫయాజుద్దీన్ భారీ మొత్తంలో పెట్టుబడి పెట్టాడు. వాటా డబ్బుల విషయంలో ఇద్దరి మధ్య కొంతకాలంగా వివాదం నడుస్తోంది. ఈ క్రమంలో ఫయాజుద్దీన్, మూసాను మంగళవారం దిల్‌కుష్ నగర్‌లోని తన ఇంటికి పిలిపించుకున్నాడు. పెట్టుబడుల విషయంలో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటు చేసుకోగా, కోపోద్రిక్తుడైన ఫయాజ్, మూసాపై రాడ్‌తో దాడి చేసి, కత్తితో పొడిచాడు. తీవ్రంగా గాయపడిన మూసా సిద్ధికిని జీడిమెట్లలో మల్లారెడ్డి నారాయణ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మరణించినట్లుగా వైద్యులు ధ్రువీకరించారు. పోలీసులు ఫయాజుద్దీన్‌ను అదుపులోకి తీసుకున్నారు.

దుర్గంధంగా బీఈడీ హాస్టల్ పరిసరాలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ బీఈడీ హాస్టల్ పరిసరాలు దుర్గంధంగా మారడంతో అనారోగ్యానికి గురవుతున్నామని పలువురు విద్యార్థులు వాపోతున్నారు. హాస్టల్ మెస్‌తో పాటు ఎటు చూసినా చెత్త, చెదారం పేరుకుపోవడంతో పాటు మురుగు నీరు పారడంతో వెలువడుతున్న దుర్వాసనతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నామన్నారు. వర్సిటీ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

రూల్‌ఆఫ్ రిజర్వేషన్లను పాటించండి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పీహెచ్‌డీ ప్రవేశాలలో రూల్‌ఆఫ్ రిజర్వేషన్లు పాటించాలని ఐక్య విద్యార్థి సంఘాల నేతలు డిమాండ్ చేశారు. మంగళవారం ఓయూలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, మహిళల విద్యార్థుల పీహెచ్‌డీ ప్రవేశాలకు రూల్‌ఆఫ్ రిజర్వేషన్లు పాటించి చివరి సీటు వరకు భర్తీ చేయాలన్నారు. ఆందోళన చేస్తున్న విద్యార్థులపై దుష్ప్రచారాన్ని మానుకోవాలని, 20 మంది విద్యార్థులపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.

విలేకరినంటూ బెదిరింపులు

పోలీస్ స్టేషన్‌లో బాధితుడి ఫిర్యాదు

సనత్‌నగర్: విలేకరి పేరుతో బెదిరింపులకు పాల్పడుతున్నాడంటూ రామకృష్ణగౌడ్ అనే వ్యక్తిపై ఎస్ఆర్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుడు అభినవ్‌రెడ్డి వివరాల ప్రకారం.. సనత్‌నగర్ సుభాష్‌నగర్, లింగయ్యనగర్‌లో నిర్మాణమవుతున్న భవనం వద్ద తాను సైట్ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నానని నిర్మాణ సామగ్రి వాహనాలు రాకుండా రామకృష్ణగౌడ్ రోడ్డుపై ఓ పక్క కారు, మరో వైపు ద్విచక్ర వాహనాలు పెట్టి ఇబ్బందులకు గురి చేస్తున్నాడని ఆరోపించాడు. తాను విలేకరినని నిర్మాణ సామగ్రి వాహనాలు వెళ్లాలంటే రూ.10 వేలు ఇవ్వాలని బెదిరిస్తున్నాడని ఫిర్యాదు చేశాడు. రామకృష్ణపై బాలానగర్ పోలీస్ స్టేషన్‌లో బెదిరింపుల కేసులు ఉన్నాయన్నారు. అభినవ్‌రెడ్డి ఫిర్యాదు మేరకు దర్యాప్తు జరుపుతున్నట్లు ఇన్‌స్పెక్టర్ సైదులు తెలిపారు.

జపాన్ వెళ్లే బృందానికి మంత్రి అభినందన


మంత్రిని కలిసిన లింబాద్రి, వీసీ రవీందర్

ఉస్మానియా యూనివర్సిటీ: జపాన్‌కు వెళ్లే ఓయూ బృందానికి విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అభినందనలు తెలిపారు. మంగళవారం రాష్ట్ర ఉన్నత విద్య మండలి చైర్మన్ ప్రొ.లింబాద్రితో కలిసి జపాన్‌కు నేడు (8న) వెళ్లనున్న ఓయూ వీసీ ప్రొ.రవీందర్, స్టూడెంట్ డీన్ ప్రొ.రాజేంద్రనాయక్, ఇంజినీరింగ్, సైన్స్ కాలేజీలకు చెందిన పది మంది విద్యార్థులు మంత్రి సబితాఇంద్రారెడ్డిని కలిసి పర్యటన వివరాలను తెలిపారు. టోక్యోలోని సిబుల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఆహ్వానం మేరకు ఈ నెల 18 వరకు జపాన్‌లో పర్యటించనున్నట్లు వెల్లడించారు.

దళితుల అభ్యున్నతి కోసమే దళితబంధు

మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్


కారు తాళాలు అందజేస్తున్న మంత్రి తలసాని

సనత్‌నగర్: దళితుల అభ్యున్నతి కోసమే ముఖ్యమంత్రి కేసీఆర్ దళితబంధు పథకాన్ని అమలు చేస్తున్నారని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. రాంగోపాల్‌పేట డివిజన్ నల్లగుట్టకు చెందిన పద్మకిషోర్‌కి దళితబంధు ద్వారా మంజూరైన కారును మంగళవారం మంత్రి అందజేసి మాట్లాడారు. దళితులు ఆర్థిక, సామాజికంగా అభివృద్ధి సాధించాలనే లక్ష్యంతో దేశంలో ఎక్కడాలేని విధంగా దళితబంధు ద్వారా రూ.10 లక్షలను అందిస్తున్న ఘనత టీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. అర్హులంతా దళితబంధును సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ అత్తెలి అరుణగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై ప్రధాని స్పష్టత ఇవ్వాలి


వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మందకృష్ణ మాదిగ

బౌద్ధనగర్: కేంద్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఎస్సీ వర్గీకరణ చేస్తామని ప్రధాన మంత్రి మోదీ హామీ ఇచ్చి తొమ్మిది సంవత్సరాలు గడుస్తున్నా ఇప్పటి వరకు వర్గీకరణ జరగలేదు. ప్రధాని హైదరాబాద్‌కు ఎప్పుడు వచ్చినా వర్గీకరణ అంశంపై స్పష్టత ఇవ్వాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ పేర్కొన్నారు.

- ఎస్సీ వర్గీకరణపై కేంద్ర ప్రభుత్వం చేస్తున్న నిర్లక్ష్యానికి నిరసనగా ఫిబ్రవరి 13న హైదరాబాద్-విజయవాడ రహదారిని దిగ్బంధం చేస్తున్నామని ఆయన తెలిపారు. మంగళవారం పార్శిగుట్టలోని కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వర్గీకరణ చేయకపోవడంతో ఎస్సీలు విద్యా, ఉద్యోగ అవకాశాలు కోల్పోతున్నారన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా నిరసనలు వ్యక్తం చేస్తున్న ఎమ్మార్పీఎస్ శ్రేణులపై బీజేపీ నేతలు దాడులు చేయటం దుర్మార్గమని దాడులకు ప్రతిదాడులు తప్పవని హెచ్చరించారు. మాదిగల మద్దతు లేకుండా రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావటం అసంభవమని బీజేపీ, మాదిగలకు ప్రత్యక్ష పోరాటం తప్పదన్నారు. వర్గీకరణ అంశం తేల్చకుండా బీజేపీ నేతలు ఎవరు వచ్చినా అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్ రానున్న ప్రధాన మంత్రి మోదీ, కేంద్ర మంత్రి అమిత్‌షాకు మాదిగల నిరసన సెగలు తగలాలన్నారు. అనంతరం, హైదరాబాద్-విజయవాడ రహదారి దిగ్బంధానికి సంబంధించి వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు గోవింద్ నరేష్, ఎంఎస్‌పీ జాతీయ నాయకుడు మున్నూరుకాపు సూరి, రాజు, విజయరావు, సోమశేఖర్, నర్సింగరావు, నందారం సీతారం, డప్పు మల్లికార్జున్, ఉప్పలయ్య పాల్గొన్నారు.

మడ్‌ఫోర్ట్ పాఠశాలలో అభివృద్ధి పనులు

డిప్యూటీ డీఈవో బాలునాయక్


చేపట్టాల్సిన పనులపై చర్చిస్తున్న బాలునాయక్, జంపన ప్రతాప్

రసూల్‌పురా: మన బస్తీ-మన బడిలో భాగంగా తిరుమలగిరి మండలం పరిధిలోని మడ్‌ఫోర్ట్ ప్రాథమిక పాఠశాల్లో వివిధ అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు డిప్యూటీ డీఈవో బాలునాయక్ తెలిపారు. మంగళవారం బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జంపన ప్రతాప్‌తో కలిసి పాఠశాలలో చేపట్టాల్సిన పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా బాలునాయక్ మాట్లాడుతూ.. పాఠశాల ప్రహరీ, టాయిలెట్స్ నిర్మాణ పనులు ప్రభుత్వం ఆధ్వర్యంలో జరుగుతున్నాయని కానీ.. తాగునీటి వసతి, మరమ్మతులు, విద్యుత్ పనులు త్వరితగతిన పూర్తి చేసేందుకు ప్రైవేటు కాంట్రాక్టర్లు చేపట్టేందుకు అవకాశం ఉందని ఈ పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఆశీర్వాదం, సుప్రద ఐరీన్, ఉపాధ్యాయులు షద్రక్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన


సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న రామకృష్ణ

రసూల్‌పురా: కంటోన్మెంట్ బోర్డు పరిధిలో ఉచిత తాగునీరు పథకం అమలు చేస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్న టీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలకు సరిపడ తాగునీటిని విడుదల చేయడం లేదని కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యులు జే. రామకృష్ణ ఆరోపించారు. రెండవ వార్డు రసూల్‌పురా సీబీఎన్‌నగర్ అంబేడ్కర్ గల్లీలో సీసీ రోడ్డు పనులు, నాగమ్మ టెంపుల్ గల్లీలో భూగర్భ డ్రైనేజీ పైపులైను పనులకు మంగళవారం ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బోర్డు పరిధిలో ప్రజలకు 90 లక్షల గ్యాలన్ల తాగునీరు అవసరం ఉండగా కేవలం 54 లక్షల గ్యాలన్ల నీటిని మాత్రమే సరఫరా చేస్తుండడంతో ప్రజలు నీళ్ల కోసం అల్లాడుతున్నారని అన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వ మోసపూరిత విధానంపై ప్రజలు తగిన రీతిలో గుణపాఠం చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ వార్డు అధ్యక్షుడు ఎం. అశోక్‌కుమార్, శంకర్, రామాంజనేయులు, లక్ష్మణ్, మహేష్ శ్రీహరి, ,సంతోష్, బలరాం, విజయ్, ప్రభాకర్, నర్సింగ్, శాంతమ్మ పాల్గొన్నారు.

ఘనంగా రేణుకా ఎల్లమ్మ కల్యాణం


పూజల్లో పాల్గొన్న భక్తులు

కంటోన్మెంట్: బోయిన్‌పల్లి నేతాజీనగర్‌లో రేణుకా ఎల్లమ్మ దేవాలయంలో కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా సాగింది. శ్రీగణేష్ ఫౌండేషన్ చైర్మన్ శ్రీగణేష్ ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల్లో ఆధ్యాత్మిక భావనలు పెరగడంతో అన్నీ శుభాలే కలుగుతాయన్నారు. ఆలయ అభివృద్ధికి తనవంతు సహకారాన్ని అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ప్రభాకర్ గౌడ్, రమేశ్ గౌడ్, సుమంత్, సాయితేజ, ఈనీష్ గౌడ్ పాల్గొన్నారు.

వేగవంతంగా అభివృద్ధి పనులు

పద్మారావునగర్: బన్సీలాల్‌పేట్ డివిజన్ పద్మారావునగర్‌లోని డీ-మార్టు పరిసరాలు, సప్తగిరి అపార్టుమెంట్, ఎస్‌బీఐ పరిసరాల్లో మంగళవారం కార్పొరేటర్ హేమలత, ఇన్‌చార్జి పవన్‌కుమార్ గౌడ్ పర్యటించారు. రోడ్లు, డ్రైనేజీ వంటి సమస్యలను పరిష్కరించాలని స్థానికులు కార్పొరేటర్‌ను కోరారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారానికి నిర్మాణాత్మకమైన కార్యక్రమాలతో ముందుకు సాగుతున్నామని, గతంతో పోల్చుకుంటే రహదారుల అభివృద్ధి, పార్కుల ఆధునీకీకరణ వంటి అనేక సదుపాయాలను మెరుగుపర్చడం జరిగిందన్నారు. మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆదేశాలతో ప్రజాభివృద్ధి పనులను వేగవంతం చేస్తున్నట్లు వివరించారు. కార్పొరేటర్ వెంట నాయకులు ఎల్. వెంకటేశన్, సుధాకర్ రెడ్డి, సురేష్, ముక్కా శ్రీనివాస్, కుషాల్, అబ్బాస్, నాగభూషణం, వెంకటేష్ ఉన్నారు.


స్థానికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ హేమలత